# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 05 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## జీహెచ్ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు

బలగం టీవీ, హైదరాబాద్



జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు ఇచ్చింది. ఆమెతో పాటు పర్యావరణ, భూగరర్భ గనుల శాఖల ముఖ్యకార్యదర్శులకు కూడా నోటీసులు జారీ చేసింది. జూబ్లీహిల్స్ నివాస ప్రాంతాల్లో కొండరాళ్లను తొలగించేందుకు రేయింబవళ్లు పేలుళ్లు జరుపుతుండడంతో ఈ విషయమై వార్తా పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ కథనాలపై స్పందించిన హైకోర్టు జడ్జి జస్టిస్ నగేశ్ భీమపాక చీఫ్ జస్టిస్‌కు లేఖ రాశారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా దాదాపు పది పేలుళ్లు జరిపి బండరాళ్లను తరలిస్తున్నట్టు ఆయన తన లేఖలో తెలిపారు. రాత్రిపూట పెద్ద శబ్దాలు వస్తుండటంతో సమీప ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ఈ లేఖను న్యాయస్థానం ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి బుధవారం విచారణ జరిపింది. అనంతరం పర్యావరణ, భూగర్భ గనులు, పురపాలక శాఖ చీఫ్ సెక్రటరీలతో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్‌లను ప్రతివాదులుగా చేర్చింది. ఈ పేలుళ్లపై వెంటనే వివరణ ఇవ్వాల్సిందిగా వారికి నోటీసులు జారీ చేసింది.

## మేడారం అడవుల్లో సుడిగాలి బీభత్సం..



- నేల కూలిన 50 వేల భారీ వృక్షాలు
- టోర్నడోల తరహాలో సుడిగాలులు
- విచారణ జరుపుతున్న అటవీశాఖ అధికారులు

బలగం టీవీ, మేడారం

ములుగు జిల్లా అడవుల్లో సుడిగాలి బీభత్సం సృష్టించింది. మేడారం-తాడ్వాయి ఫారెస్ట్ ఏరియాలో టోర్నడో తరహాలో భీకర గాలులు వీచాయి. దీంతో భారీ వృక్షాలు నేలకూలాయి. సుమారు 200 హెక్టార్ల మేర 50వేలకు పైగా చెట్లు నేలకూలినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఊహించని రీతిలో వచ్చిన సుడిగాలితో అడవిలో పెద్ద ఎత్తున విధ్వంసం చెలరేగింది. సుమారు 15 కిలోమీటర్ల వ్యవధిలో దాదాపు 200 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 50వేల చెట్లు నేలకూలాయి. గాలి బీభత్సానికి స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అడవిలో పరిస్థితిని సమీక్షించారు.

వివిధ జాతులకు చెందిన వందల్ల ఏళ్ల క్రితం నాటి మహా వృక్షాలు నేలకొరిగాయి. ఇంత పెద్ద ఎత్తున చెట్లు నేలమట్టం కావడం అందరినీ షాక్ కి గురి చేస్తోంది. ఈ హఠాత్ పరిణామంతో ముఖ్యంగా అడవి బిడ్డలు, ఆదివాసీలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో జరిగిన అసాధారణ మార్పులు, మహా ప్రళయం వల్లే ఇలా జరిగి ఉండొచ్చని అంటున్నారు. ఈ ఊహించని ఘటన అడవి బిడ్డలను, అటవీ శాఖ అధికారులను ఆందోళనలో పడేసింది.

ఒకే చోట 3 కిలోమీటర్ల విస్తీర్ణం లోపల అడవికి సంబంధించిన ఆనవాళ్లు లేకుండా పోయాయి. సుడిగాలి సృష్టించిన బీభత్సం చూసి స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పెద్ద పెద్ద చెట్లు గాలికి కొట్టుకుపోయి ప్రధాన రహదారులపై పడటం, ఒకే చోట వేలాది చెట్లు నేలకూలటం.. అందరినీ షాక్ కి గురి చేస్తోంది. దీనిపై అటవీశాఖ అధికారులు విచారణ చేస్తున్నారు.

ఆగస్టు 31వ తారీఖున సాయంత్రం 5:30 నుండి రాత్రి 7 గంటల మధ్య మేడారం అడవుల్లో ఒక్కసారిగా అలజడి. పెద్ద ఎత్తున గాలి దుమారం వచ్చినట్టు తెలుస్తోంది. మహావృక్షాలు సైతం చిగురుటాకులా వణికిపోయాయి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 50వేలకు పైగా వృక్షాలు నేల కూలాయి. ఇదంతా వాతావరణంలో ఏర్పడిన మార్పులే కారణం అంటున్నారు నిపుణులు. ఇదంతా టోర్నడోలు వల్ల జరిగి ఉండవచ్చు అని అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా, టోర్నడోలు ఒక స్పష్టమైన మార్గంలో సాగే గాలుల ధాటికి చెట్లు కూలిపోతాయి. అయితే, ఇలాంటి ప్రతికూల వాతావరణంలో గాలుల వేగం గంటకు 120 కిలోమీటర్ల వరకు ఉండి, అంతే వేగంగా తిరిగినట్లు అనిపించింది. ఈ టోర్నడోలు టెక్నికల్‌గా అనేక కారకాల వల్ల ఏర్పడుతుందనీ, వీటిలో అధిక వేగంతో కూడిన గాలులు, అవీ సంభవించే మార్గంలో అనేక చెట్లు కూలిపోవడం ఒక భాగమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా, ఈ సంఘటన వల్ల పాత చెట్లపై ఎక్కువ ప్రభావం చూపిందని వారు చెప్పారు.

## తెలంగాణకు కేంద్ర బృందం..

- త్వరలోనే ఏరియల్ సర్వే
- సీఎస్‌కు హోంశాఖ నుంచి లేఖ
- ఎస్‌డీఆర్ఎఫ్ నిధుల వినియోగానికి గ్రీన్ సిగ్నల్
- నష్టం వివరాలు నిర్ణీత ఫార్మాట్‌లో పంపాలన్న కేంద్రం

బలగం టీవీ, హైదరాబాద్



తెలంగాణ సీఎస్‌కు కేంద్ర హోంశాఖ లేఖ రాసింది. తెలంగాణలో వరద నష్టం వివరాలు నిర్ణీత ఫార్మాట్‌లో పంపాలని ఆదేశించింది. రూ.1,345 కోట్ల ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు ఇప్పటికే తెలంగాణ దగ్గర అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. వరదల్లో సాయం చేసేందుకు ఇప్పటికే 12 ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు, 2 హెలికాప్టర్లు పంపించినట్లు చెప్పింది కేంద్ర హోంశాఖ. ఎస్‌డీఆర్ఎఫ్ నిధికి కేంద్ర వాటా నిధుల కోసం వివరాలు పంపాలని స్పష్టం చేసింది. జూన్‌లో 208 కోట్ల రూపాయల విడుదలకు ఎలాంటి వినతి రాలేదని తెలిపింది. యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించకపోవడం వల్లే ఆ నిధులు విడుదల చేయలేదని పేర్కొంది. అది సమర్పించిన వెంటనే వాటిని విడుదల చేస్తామని తెలిపింది హోంశాఖ.

అకాల వర్షాలు, వరదలు తెలంగాణలోని పలు జిల్లాల్లో తీవ్ర నష్టాన్ని మిగిల్చడంతో నిధుల వినియోగం, మంజూరుకు సంబంధించి రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ హోంశాఖ మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డి కూడా ప్రధాని రాష్ట్రంలో పర్యటించాలని కోరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హోంశాఖ డైరెక్టర్ అశిష్ గవాయ్‌కు కీలక ఆదేశాలు జారీ చేశారు షా. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఢిల్లీ నుంచి లేఖ వచ్చింది. ఎస్‌డీఆర్ఎఫ్ నిధులపై క్లారిటీ ఇచ్చింది. ఇటు ఏరియల్ సర్వేపైనా అమిత్ షాను కోరిన నేపథ్యంలో ఆయన సానుకూలంగా స్పందించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో త్వరలోనే కేంద్ర బృందం సర్వే చేయనుంది.

బీజేపీ కూడా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు సిద్ధమైంది. కిషన్ రెడ్డి, బండి సంజయ్ నేతృత్వంలో రెండు బృందాలు జిల్లాల్లో పర్యటించనున్నాయి. వరదల వల్ల జరిగిన నష్టాన్ని వీరు అంచనా వేయనున్నారు. అలాగే, బాధితులను పరామర్శించి ఓదార్చనున్నారు.

## సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగం పెరిగేలా చర్యలు

- నిరూపయోగంగా ఉన్న భూముల్లో సోలార్ ఉత్పత్తి చేయాలి
- రైతులకు ఉచితంగా సోలార్ పంప్‌సెట్లు అందజేయాలి
- పైలెట్ ప్రాజెక్ట్‌గా కొండారెడ్డిపల్లె
- సీఎం రేవంత్‌రెడ్డి
- విద్యుత్ అధికారులు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సీఎం సమీక్ష



బలగం టీవీ, హైదరాబాద్

రాబోయే రోజుల్లో ఒక బిజినెస్ హబ్‌గా మారబోతున్న తెలంగాణలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉండేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని విద్యుత్ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో కలిసి విద్యుత్ శాఖపై ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. రాష్ట్రంలో విద్యుత్ రంగం, ప్రజల అవసరాలకు అనుగుణంగా తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు చేశారు.

రాష్ట్రంలో డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి చేసేందుకు వీలుగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల పరిధిలో నిరుపయోగంగా ఉన్న భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని.. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించడానికి రైతులకు ఉచితంగా సోలార్ పంప్‌సెట్లు అందజేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అందుకు కొండారెడ్డిపల్లెలో పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలన్నారు. వంటగ్యాస్ బదులుగా సోలార్ విద్యుత్ వినియోగ విధానం. మహిళా సంఘాలకు శిక్షణ, అటవీ భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఏటా 40వేల మెగావాట్స్ విద్యుత్ అందుబాటులో ఉండే విధంగా కార్యాచరణ ఉండాలన్నారు. ఓవర్ లోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడం చేయాలన్నారు.

## హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడితే జైలుకే

- హైడ్రా కమిషనర్ ఏ.వీ రంగనాథ్



బలగం టీవీ, హైదరాబాద్

హైడ్రాకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరించి వసూళ్లకు పాల్పడితే జైలు జీవితం తప్పదని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు. గత కొద్ది రోజులు ట్రై సిటీ పరిధిలో హైడ్రా విభాగం విస్తృతంగా అక్రమ నిర్మాణాల తొలగింపులు చేపడుతున్న నేపథ్యంలో కొద్ది మంది సామాజిక కార్యకర్తల ముసుగులో బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్ పరిధిలో లేదా వాటి పరిసరాల్లో నిర్మాణం చేపడుతున్న బిల్డర్లను ఇది అక్రమ నిర్మాణమని, బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్ పరిధిలో నిర్మిస్తున్నారని హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని, అలాగే అధికారులతో ఉన్న ఫోటోలు చూపించి హైడ్రా విభాగంలోని ఉన్నతాధికారులతో తమకు పరిచయాలు వున్నాయని, మీకు ఎలాంటి సమస్య రాకుండా చేస్తామని ఇందుకోసం కొంత డబ్బు ముట్టజెప్పాల్సిందిగా.. లేదంటే హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని కొద్ది మంది వ్యక్తులు, సంస్థలు బిల్డర్లను బెదిరింపులు పాల్పడటంతో పాటు గత కొద్దికాలంగా బహుళ అంతస్తుల్లో, వ్యక్తిగత గృహాల్లో నివాసం వుంటున్న వారి వద్ద ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్నారు.

ఎవరైనా ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్నట్లైతే.. అలాగే ఇతర ప్రభుత్వ విభాగాలైన రెవెన్యూ, మున్సిపల్, నీటి పారుదల విభాగాలతో పాటు హైడ్రా విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది సైతం ఎవరైనా కూడా హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ డబ్బు కావాలని ఒత్తిడి చేస్తే ప్రజలు, బిల్డర్లు తక్షణమే స్థానిక పోలీస్ స్టేషన్ లో కానీ, ఎస్పీకి, సీపీకి కానీ లేదా హైడ్రా కమిషనర్, ఏసీబీకి కూడా ఫిర్యాదు చేయాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి మంచి ఉద్దేశాలతో ఈ హైడ్రా విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరైనా ఈ విభాగాన్ని నీరుగార్చే ప్రయత్నాలు కానీ, తప్పుదోవ పట్టించే విధంగా యత్నించే వారిపై కూడా కఠినంగా వ్యవహరిస్తామని, ఈ విభాగం పేరుతో ఎవరైనా వ్యక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం డబ్బు వసూళ్ల చర్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు.

**హైడ్రా పేరుతో డబ్బు వసూళ్ళకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్**

సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ ప్రాంతానికి చెందిన డా.విప్లవ్ సామాజిక కార్యకర్త ముసుగులో స్థానిక బిల్డర్‌ను డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడుతున్నట్టుగా సదరు బాధిత బిల్డర్ గత సోమవారం హైడ్రా కమిషనర్ ను కలిసి ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదును పరిశీలించిన వాస్తవాలు గ్రహించి అనంతరం హైడ్రా కమిషనర్ సూచన మేరకు ఎస్పీ సంగారెడ్డి బాధిత బిల్డర్ నుండి ఫిర్యాదు స్వీకరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న డా.విప్లవ్ అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని పోలీసులు బుధవారం ఉదయం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

## నేటి నుంచి వరద బాధితుల ఖాతాల్లో నగదు



బలగం టీవీ, హైదరాబాద్

ఖమ్మం జిల్లాలో ఇటీవలి వర్షాలు, వరదల కారణంగా నిరాశ్రయులైన బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుం టుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం నుంచి బాధితుల ఖాతాల్లో నగదును జమచేస్తామన్నారు. ఖమ్మంలోని కేఎంసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

అకస్మాత్తుగా వచ్చిన మున్నేరు వరదల కారణంగా ఖమ్మం నగరంలో సుమారు 5 వేల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో మరో 2,500 ఇళ్లు కలిపి మొత్తం 7,500 ఇళ్లు ముంపునకు గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు వివరించారు. అధికారులు ఇంకా క్షేత్రస్థాయి పరిశీలనలో ఉన్నారని, మరో రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి నివేదికలు వస్తాయని అన్నారు. గడిచిన వందేళ్లలో మున్నేటికి ఇంత వరద ఎన్నడూ రాలేదని అన్నారు. అయినప్పటికీ ఒక్క ప్రాణనష్టమూ జరుగకుండా కలెక్టర్, సీపీ సహా ఇతర అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. వారి కృషిని అభినందిస్తున్నట్లు చెప్పారు. అలాగే, వరద ముంపు ప్రాంతాల్లో శానిటేషన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, విద్యుత్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని తుమ్మల వివరించారు. ప్రతి ఇంటికీ నిత్యావసర సరుకులు ఇస్తున్నామని, అవసరమైతే రెండోసారి కూడా పంపిణీ చేస్తామని అన్నారు.

వరద తెచ్చిన బురదను తొలగించేందుకు 100 ట్రాక్టర్లు, 50 జేసీబీలు, 70 ట్యాంకర్లు పనిచేస్తున్నాయన్నారు. పునరావాస కేంద్రాలను మరికొద్ది రోజుల వరకూ కొనసాగిస్తామన్నారు. చాలా వరకు విద్యుత్ మీటర్లు తడిచినందున వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు అందిస్తున్నాయన్నారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ పాల్గొన్నారు.

## 'ఖమ్మం వరద బాధితులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీల ఒక నెల వేతనం విరాళం



- కేసీఆర్ సూచన మేరకు నిర్ణయం
- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

బలగం టీవీ, హైదరాబాద్

ఖమ్మం వరద బాధితులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒక నెల జీతాన్ని విరాళంగా ప్రకటించారు. మాజీ సీఎం కేసీఆర్ సూచనల మేరకు తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒక నెల జీతాన్ని విరాళంగా ఇస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఖమ్మం వరదలపై కేసీఆర్ విచారం వ్యక్తం చేశారని, బాధితులకు సాయం అందించాలని ఆయన ఆదేశించారని తెలిపారు. నిత్యావసర సరుకులను గురువారం సిద్దిపేట నుంచి ఖమ్మం వరద బాధితుల ఇంటింటికి అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఖమ్మంలో వరదలు వచ్చాయని వివరించారు. తాను ఖమ్మం వెళ్లి వరద బాధితులను పరామర్శించానని హరీశ్‌రావు చెప్పారు. వారిని చూస్తే తన కళ్లలో కన్నీళ్లు వచ్చాయని తెలిపారు. వరద బాధితులకు సహాయం చేయడానికి అందరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేటలో అమర్‌నాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులకు మట్టి వినాయకుని పంపిణీ చేశారు. చెరువులను కాపాడడం మన అందరి బాధ్యత అని, మట్టి వినాయకులను పూజిద్దామని చెప్పారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చెరువులో చేపలు చనిపోతున్నవి, పర్యావరణం, చెరువులను కాపాడుకుందామని ఆయన వ్యాఖ్యానించారు.

## విజయవాడ రూట్‌లో వెళ్లే ప్రయాణికులకు 10శాతం రాయితీ

- బంపరాఫర్ ప్రకటించిన టీజీఎస్ఆర్టీసీ




బలగం టీవీ, హైదరాబాద్

ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులకు డిస్కౌంట్ ఆఫర్‌ని ప్రకటించింది. ఈ రూట్‌లో రాకపోకలు సాగించే ప్రయాణికులకు టికెట్ ధరపై 10శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రకటించారు. రాజధాని ఏసీ, సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణంపై డిస్కౌంట్ ఆఫర్ వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సజ్జనార్ కోరారు. అడ్వాన్స్‌డ్ టికెట్ రిజర్వేషన్ కోసం tgsrtc.telangana.gov.in వెబ్‌సైట్‌ని సంప్రదించాలని కోరారు. ఇదిలా ఉండగా.. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో వరదలు పోటెత్తడంతో హైదరాబాద్ - విజయవాడ మధ్య రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. దాదాపు 36 గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. వరద ఉధృతి స్వల్పంగా తగ్గడంతో మళ్లీ రాకపోకలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు టికెట్లపై రాయితీని ప్రకటించింది.



## భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం

- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలంలో గోదావరికి వరద పోటెత్తుతున్నది. గంట గంటకు వరధ ఉధృతి పెరుగుతున్నది. నీటి మట్టం 43.1 అడుగులు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ క్రమలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. వాగులు, చెరువులు వద్దకు ఎవరు సందర్శకులు వెళ్ల కూడదని, మత్స్యకారులు గోదావరి వద్దకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.భారీ వర్షాలు కురుస్తున్నందున గోదావరి నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నది. కాగా, 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు నీటి మట్టం చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ప్రస్తుతం వర్షాలు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తో పాటు గోదావరి పరీవాహక ప్రాంతంలో వర్షాలు దంచికొడుతున్నాయి. దాంతో వరద పెరిగే అవకాశం కనిపిస్తున్నది.

# నేటి నుంచే ఏఐ గ్లోబల్ సమ్మిట్

- హెచ్ఐసీసీలో రెండ్రోజులు అంతర్జాతీయ సదస్సు
- ఏఐ టెక్నాలజీపై దేశంలో తొలిసారి జరుగనున్న అంతర్జాతీయ సదస్సుకు ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమైన హైదరాబాద్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై దేశంలో తొలిసారి జరుగనున్న అంతర్జాతీయ సదస్సుకు ఆతిథ్యమిచ్చేందుకు హైదరాబాద్ సిద్ధమైంది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న ఈ సదస్సును సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. రెండ్రోజులపాటు జరిగే ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి దాదాపు 2 వేల మంది ఐటీ రంగ నిపుణులు రానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఏఐ సిటీ ప్రాజెక్టుపై ఈ సదస్సులో ప్రత్యేక ప్రకటన చేసే అవకాశం ఉన్నది. ఈ సదస్సులో భాగంగా ఏఐ స్టార్టప్ షోకేస్‌ను ప్రారంభించనున్నారు. 'ది ఫ్యూచర్ ఆఫ్ ఇండియా–ఇండియా ఏఐ 2047' అనే అంశంపై నాస్కామ్




ప్రెసిడెంట్ దేబాంజీ ఘోష్ కీలక ప్రసంగం చేయనున్నారు. 'మేకింగ్ జనరేటివ్ ఏఐ రియల్ ఫర్ భారత్' అనే అంశంపై చర్చించనున్నారు. దాదాపు 25 అంశాలపై ఐటీ రంగ నిపుణులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, వెంచర్ క్యాపిటలిస్టులు ప్రసంగించనున్నారు.

'ప్రతి ఒక్కరికి కృత్రిమ మేధస్సు' అనే ఇతివృత్తం (థీమ్)తో నిర్వహించనున్న ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన ఏఐ రంగ ప్రముఖులు, సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఏఐ రంగం అభివృద్ధికి దోహదం చేసే ఆలోచనలను పరస్పరం పంచుకోవడంతోపాటు భవిష్యత్తు అవకాశాలు, కొత్త ఆవిష్కరణలపై చర్చించనున్నారు. హైదరాబాద్‌లో నిర్మించనున్న ఫోర్త్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిష్ఠాత్మకంగా ఏఐ సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఆ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ప్రసంగించనున్నారు. రాష్ట్రాన్ని ఏఐ హబ్‌గా తీర్చిదిద్దేందుకు, ప్రపంచ దిగ్గజ సంస్థల నుంచి పెట్టుబడులను ఆహ్వానించేందుకు ఈ సదస్సు వేదికగా నిలవనున్నది. ఏఐ రంగంపై రోడ్ మ్యాప్‌ను ఈ సదస్సులో విడుదల చేయనున్నారు.



## విజయవాడ-హైదరాబాద్ మధ్య రైళ్ల రాకపోకలు పునరుద్ధరణ

**బలగం టీవీ, హైదరాబాద్**

గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో రైల్వే ట్రాక్ దెబ్బతిని విజయవాడ–హైదరాబాద్ మధ్య నిలిచిపోయిన రాకపోకలను రైల్వే శాఖ పునరుద్ధరించింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం సమీపంలో వద్ద ట్రాక్ మరమ్మతులు పూర్తి కావడంతో రైలు సర్వీసులు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ వెళ్లే రైళ్లను వరంగల్ మీదుగా పంపిస్తున్నారు. ట్రయల్ రన్లో భాగంగా విజయవాడ నుంచి గోల్కొండ ఎక్స్ప్రెస్ను తొలుత పంపారు. ఆ రైలు విజయవాడ, గుంటూరు, వరంగల్ మీదుగా హైదరాబాద్ వెళ్లింది. అప్లైన్లో సర్వీసులను పునరుద్ధరించామని.. డౌన్లైన్లో బుధవారం అర్ధరాత్రికి పనులు పూర్తిచేస్తామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

# కేసీఆర్ మాదిరి ఫాంహౌస్‌లో కూర్చోలేదు

- ప్రజల్లోనే ఉన్నాం
- మంత్రి పొంగులేటి

**బలగం టీవీ, హైదరాబాద్**

మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగా విదేశీ కుట్ర అంటూ ఫాంహౌస్‌లో కూర్చోలేదని, చినుకు పడిన క్షణం నుంచి ప్రజల్లోనే ఉన్నామని, మా ముందస్తు చర్యల వల్ల వీలైనంత ప్రాణ నష్టం తగ్గించగలిగామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులు విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని, ప్రజల రక్షణే తమకు ముఖ్యమన్నారు. వరదలపై మంగళవారం ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను బుధవారం మంత్రి పొంగులేటి తప్పుబట్టారు. దీనికి సంబంధించి మంత్రి పొంగులేటి ఓ ప్రకటన విడుదల చేశారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వచ్చిన భారీ వర్షాలు, వరదలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వారి వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి క్లౌడ్–బరస్ట్, విదేశీ కుట్ర అంటూ మతిలేని ప్రకటనలు చేసిన బిఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. విదేశీ కుట్ర అని ఫాంహౌస్ దాటని బీఆర్ఎస్ పార్టీ పెద్దలు ఈరోజు వరదల గురించి



మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఆనాడు ప్రకృతిపరంగా కురిసిన వర్షాలను కూడా కుట్రకోణంలో చూసిన ఆ పెద్దమనిషి, ఆయన అల్లుడు హరీష్ రావు కూడా ఇప్పుడు వచ్చిన వర్షాలను కుట్ర కోణంలోనే చూస్తున్నారా అని మంత్రి వ్యాఖ్యానించారు.

# తగ్గింపు ధరలకే హెల్మెట్లు ఇవ్వాలి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**బలగం టీవీ, హైదరాబాద్**

కేవలం హెల్మెట్లు ధరించక పోవడం వల్లనే రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మరణిస్తున్నారని, ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహన తయారీదారులు వాహన కొనుగోలుదారులకు తగ్గింపు ధరకు లేదా సహేతుకమైన ధరలకు హెల్మెట్లను అందించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2022 లో హెల్మెట్ ధరించక పోవడం వల్లనే రోడ్డు ప్రమాదాల్లో 50,029 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అందువల్ల వాహన కొనుగోలుదారులకు హెల్మెట్‌లపై కొంత డిస్కౌంట్ ఇవ్వగలిగితే ప్రజల ప్రాణాలను కాపాడగలమనిపిస్తోందని మంత్రి వాహనతయారీ దారులను అభ్యర్థించారు.పాఠశాల బస్సులకు కూడా పార్కింగ్ ఏర్పాటుకు సంబంధించి ఒక ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మోటారు వాహనాల (సవరణ) చట్టం ,2019 ట్రాఫిక్ నేరాలపై భారీగా పెనాల్టీలను అమలు చేసిందని, వాస్తవానికి దీన్ని సమర్థంగా అమలు చేయడం కూడా పెద్ద సవాలుగా ఉందన్నారు. దేశంలోని ప్రతి తాలూకాలో డ్రైవింగ్‌స్కూల్ ప్రారంభించాలన్నది తన ఆశయమని తెలిపారు. "అనుకోని గాయాల నివారణకు జాతీయ వ్యూహం" పేరున ఆరోగ్య మంత్రిత్వశాఖ నుంచి విడుదలైన కొత్త నివేదిక ప్రకారం దేశం లోని రోడ్డు ప్రమాదాల్లో అనుకోని గాయాల వల్లనే చాలా



మంది చనిపోతున్నారని, ఈ మరణాల్లో 43 శాతం కన్నా ఎక్కువ దీనివల్లనే అని తేలింది.

## వయనాడ్ బాధితులకు రాహుల్ ఒక నెల వేతనం విరాళం

**బలగం టీవీ, హైదరాబాద్**

వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటన బాధితులకు పునరావాస కార్యక్రమాల కోసం కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి)కి లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఒక నెల జీతం రూ. 2.3 లక్షలు విరాళంగా అందజేసినట్లు పార్టీ రాష్ట్ర శాఖ బుధవారం వెల్లడించింది. కాంగ్రెస్ రాష్ట్ర శాఖ సమీకరిస్తున్న నిధుల్లో భాగంగా ఆ విరాళం అందజేసినట్లు కెపిసిసి ప్రధాన కార్యదర్శి ఎం లిజు ఒక ప్రకటనలో తెలియజేశారు. వయనాడ్ జిల్లాలో మూడు గ్రామాల్లో జూలై 30న కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో 200 మందికి పైగా మరణించగా 78 మంది జాడ ఇంకా తెలియరావడం లేదు.

## యశోద హాస్పిటల్ గ్రూప్స్ రూ. కోటి విరాళం

**డిప్యూటీ సీఎం భట్టికి చెక్కు అందజేత**

**బలగం టీవీ, హైదరాబాద్**

వరద బాధితులను ఆదుకునేందుకు యశోద హాస్పిటల్ గ్రూప్స్ కోటి రూపాయల విరాళం ప్రకటించింది..విరాళం చెక్కును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆస్పత్రి ఆపరేటర్స్ చీఫ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి బుధవారంఅందజేశారు. ఆపద కాలంలో దాతృత్వాన్ని చాటుకున్న యశోద హాస్పిటల్స్ చైర్మన్ రవీందర్ రావు, డైరెక్టర్లు సురేందర్రావు, దేవేందర్ రావులను ఉప ముఖ్యమంత్రి అభినందించారు.

## ఏపీకి భారత్ బయోటెక్ సంస్థ రూ.కోటి విరాళం

**బలగం టీవీ, అమరావతి**

ఏపీలో వరద బాధితుల సహాయార్థం భారత్ బయోటెక్ సంస్థ రూ.కోటి విరాళం ప్రకటించింది. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి ఖాతాకు జమచేసినట్టు భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్ల, ఎండీ సుచిత్ర ఎల్ల ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సాయం వరద బాధితులను ఆదుకునేందుకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. త్వరలోనే పరిస్థితులు సాధారణ స్థితికి రావాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

# పార్టీ ఫిర్యాయించిన ఎమ్మెల్యేలకు పెన్షన్ కట్

- బిల్లు ఆమోదించిన హిమాచల్ అసెంబ్లీ

**బలగం టీవీ, హైదరాబాద్**

హిమాచల్ ప్రదేశ్‌లో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు ఇకపై పెన్షన్ నిలిపివేయనున్నారు. దీనికి సంబంధించిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మేరకు కొత్త బిల్లు ప్రవేశపెట్టింది. ఎమ్మెల్యేల ఫిరాయింపులను అరికట్టేందుకు ఈ చర్యలు చేపట్టింది. హిమాచల్ ప్రదేశ్ శాసనసభ (సభ్యుల భత్యాలు, పెన్షన్) సవరణ బిల్లు 2024ను సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు మంగళవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ఈ బిల్లులో ప్రస్తావించారు. 'రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం ఏ సమయంలోనైనా అనర్హులుగా ఉన్నట్లయితే, చట్టం ప్రకారం ఒక వ్యక్తి పెన్షన్‌కు అర్హులు కాదు' అని ఆ బిల్లులో పేర్కొన్నారు. కాగా, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఆమోదించిన కొత్త బిల్లు ప్రకారం ఇతర పార్టీలకు ఫిరాయించిన ఎమ్మెల్యేలకు పెన్షన్ నిలిపివేస్తారు. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలకు ఇది వర్తిస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ రాష్ట్రంలోని ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంతో వారిపై అనర్హత వేటు పడింది.



# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు భారతీయులు మృతి
- మృతుల్లో ముగ్గురు తెలంగాణ వారు..

**బలగం టీవీ, హైదరాబాద్**

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు భారతీయులు మరణించారు. మృతుల్లో ముగ్గురు తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. ఈ ఘటన టెక్సాస్‌లోని అన్నాలో జరిగింది. బెంటన్‌విల్లేకు వెళ్లేందుకు కార్‌పూలింగ్ యాప్ ద్వారా రైడ్ బుక్ చేసుకున్న నలుగురు భారతీయులు ఒకే క్యాబ్‌లో ప్రయాణించారు. అయితే ఒక లారీ వేగాన్ని కంట్రోల్ చేసుకోలేక ముందున్న వారి ఎస్‌యూవీని ఢీకొట్టింది. ముందున్న వాహనాలను ఆ కారు ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. నలుగురు భారతీయులు ఆ కారులో చిక్కుకుని కాలి మరణించారు. మృతదేహాలను గుర్తించలేనంతగా కాలిపోయారు. కాగా, కార్‌పూలింగ్ యాప్ సమాచారం ద్వారా ప్రమాదంలో చనిపోయినవారిని అమెరికా పోలీసులు గుర్తించారు. మృతులను హైదరాబాద్‌కు చెందిన ఆర్యన్ రఘునాథ్ ఓరంపాటి, అతడి స్నేహితుడు ఫరూక్ షేక్, తెలంగాణకు చెందిన లోకేష్ పాలచర్ల, తమిళనాడుకు చెందిన దర్శిని వాసుదేవన్‌గా గుర్తించారు.

బెంటన్‌విల్లేలో నివసిస్తున్న ఆర్యన్, స్నేహితుడు ఫరూక్ షేక్‌తో కలిసి డల్లాస్‌లోని బంధువు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదంలో వారిద్దరూ మరణించాడు. ఆర్యన్ తండ్రి సుభాష్ చంద్రారెడ్డికి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో మ్యాక్స్ అగ్రి జెనెటిక్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఉంది. రాయచోటికి చెందిన ఈ కుటుంబం హైదరాబాద్‌లోని నిజాంపేటలో స్థిరపడింది. మరోవైపు భార్యను కలిసేందుకు బెంటన్‌విల్లేకు వెళ్తున్న లోకేష్ ఈ ప్రమాదంలో చనిపోయాడు. అలాగే ఆర్లింగ్టన్‌లోని టెక్సాస్ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ గ్రాడ్యుయేట్ అయిన తమిళనాడుకు చెందిన దర్శిని తన బంధువును కలిసేందుకు బెంటన్‌విల్లేకు వెళ్తూ ఈ ప్రమాదంలో





మరణించింది. వీరి మరణ వార్త తెలియడంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొన్నది. తమ వారి మృతదేహాలను భారత్‌కు రప్పించేందుకు చొరవ చూపాలని బాధిత కుటుంబాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి.

# తెలంగాణలో అతిభారీ వర్షాలు..



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో వర్షాలు దంచికొడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా వరదలు పోటెత్తాయి. చెరువులు జలకళను సంతరించుకోగా.. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షాలకు సంభవించిన వరదలతో ఖమ్మం సహా పలుచోట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా వర్షాలపై వాతావరణశాఖ మరో కీలక అప్‌డేట్‌ను అందించింది. రాబోయే 4 రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. యానం, ఉత్తరాంధ్ర పరిసరాల్లో కొనసాగుతున్న అల్పపీడనం సముద్రమట్టానికి సగటున 3.1 నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉందని.. ఎత్తుకువెళ్లే కొలది నైరుతి దిశలో వంగి ఉందని పేర్కొంది. గురువారం వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ క్రమంలో రాగల 4 రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని.. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గురువారం భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతిభారీ వర్షాలు.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుతో కూడిన వర్షాలు పడుతాయని చెప్పింది. గడిచిన 24గంటల్లో నిజామాబాద్, మంచిర్యాల, సిద్దిపేట, కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సిద్దిపేట జిల్లాలో కొహెడలో 22.3, సముద్రాల గ్రామంలో 21 సెంటీమీటర్ల భారీ వర్షాపాతం రికార్డయ్యిందని టీజీడీపీఎస్ వివరించింది.

# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి..





- **ఇందిరా మహిళా శక్తి పథకం... స్వయం సమృద్ధికి దోహదం..**
- **జోగాపూర్, మర్రిగడ్డ, ఐడీఓసీలో యూనిట్స్ ఓపెన్**
- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, స్వయం సమృద్ధి సాధించాలనే సద్దుదేశంతో ఇందిరా మహిళా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని,మహిళలుఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా ఎదగాలని, మిగితా వారికి ఆదర్శంగా నిలువాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా వెలుగు స్వయం స్వశక్తి సంఘం వారి ఆధ్వర్యంలో రూ. మూడు లక్షల బ్యాంక్ రుణంతో శ్రీ లక్ష్మినరసింహా ఈవెంట్ మేనేజ్మెంట్ ఏర్పాటు చేయగా, మర్రిగడ్డ గ్రామంలో మణిదీప స్వయం స్వశక్తి సంఘం వారి ఆధ్వర్యంలో ఎంటర్ప్రైజ్ రూ. 3.50 లక్షలతో ఏర్పాటు చేయగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మహిళా శక్తి క్యాంటీన్ ను బ్యాంక్ లోన్ రూ. 3 లక్షలు, స్త్రీ నిధి నుంచి రూ. 2 లక్షలతో సుజాత- లక్ష్మి కలిసి ఏర్పాటు చేయగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఆర్డీఓ శేషాద్రితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పథకంలో భాగంగా జిల్లాలో మూడు యూనిట్లు ప్రారంభించుకోవడం అభినందనీయం అన్నారు..

రాష్ట్రంలోని కోటి మంది మహిళను కోటీశ్వరులు గా చేసే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, ఏటా రూ. 20 వేల కోట్లు వెచ్చించి బ్యాంకు ద్వారా వారి జీవన ఉపాధిని పెంపొందించే కార్యక్రమాన్ని చేపడుతతూ మహిళా సాధికారికత లక్ష్యంగా ముందుకుపోతున్నామని అన్నారు.

జిల్లాలో ఇంచుమించు 9,985 మహిళా సంఘాలలోని 1,34,498 మంది సభ్యులుఉన్నారని, వారిలో ఎవరైతే ఉపాధి పరిశ్రమలు పెట్టుకోవడానికి ముందుకు వస్తున్నారో రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో 600 కోట్ల బ్యాంక్, స్త్రీ నిధి రుణాలు ఇప్పించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని అన్నారు.మహిళలకు ఉపాధి కోసం 125 రకాల ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా ఉపాధి అవకాశాలపై విస్తృత ప్రచారం చేయాలని అన్నారు.

ఇప్పటికే రైతు రుణమాఫీ చేశామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తున్నాం, ఆరోగ్యశ్రీ పరిమితి పది లక్షలకు పెంచడం జరిగిందని తెలిపారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల కింద సహాయం చేయడం జరుగుతుందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా, ఎల్ డీ ఎం మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, డీపీఎంలు సుధారాణి పద్మయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, ప్రధాన కార్యదర్శి రజిత ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఎత్తు, బరువు తప్పనిసరిగా కొలవాలి..



- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..**

**బలగం టీవీ , రుద్రంగి:**

అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువు తప్పనిసరిగా కొలవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా రుద్రంగిలోని ఆరు అంగన్వాడి కేంద్రాలను ఒక చోట చేర్చి, వీహెచ్ ఎస్ఎన్ లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివరించారు. ఈ సందర్భంగా పిల్లల ఎత్తు, బరువు కొలువగా, కేంద్రానికి రాని వారికి తర్వాత కొలువాలని కలెక్టర్ ఆదేశించారు. వారి ఎత్తు, బరువు ఆధారంగా పోషకాహారం ఇవ్వాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వివరించారు. ఇక్కడ డీడబ్ల్యుఓ లక్ష్మీ రాజం, డిఎంహెచ్ఓ వసంతరావు, సిడిపిఓ సుచరిత, సూపర్ వైజర్ మమత తదితరులు పాల్గొన్నారు.

**రుద్రంగిలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలి..**

రుద్రంగిలో స్మశాన వాటిక నిర్మాణానికి స్థలాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రుద్రంగిలో స్థలాన్ని పరిశీలించి, వివిధ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీఓ నటరాజ్ ను ఆదేశించారు. వడ్డెర కాలనీ లో రోడ్డు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పరిశీలించారు. రోడ్డు, కేజీబీవీలో ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఇక్కడ తహసీల్దార్ శ్రీలత, ఎంపీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈజీ మనీకి ఆశపడి.. మీ కష్టార్జితన్ని కోల్పోవద్దు

- **మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..**
- **ఎస్పీ అఖిల్ మహాజన్**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ప్రజలు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారని,మల్టీ లెవల్ మార్కెటింగ్ ల పేరుతో మోసాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని,మోసపూరిత ప్రచారాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,ఈజీ మనీ ఆశలో పడి మోసపోవద్దని ఎస్పీ అఖిల్ మహజన్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ జిల్లాలో కొంత మంది ఎలక్ట్రానిక్ షాప్ యజమానులు,వ్యాపారస్తులు మల్టీ లెవల్ మార్కెటింగ్ కి పాల్పడుతూ వివిధ పేర్లతో ప్రజల వద్ద డబ్బులు తీసుకొని రెండు సంవత్సరాలకు రెట్టింపు డబ్బులు ఇస్తామని మోసాలకు పాల్పడుతున్నారాని అన్నారు.అలాంటి మోసాలకు పాల్పడుతున్న వారి సమాచారం పోలీస్ వారికి అందించాలని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

ప్రజల అమాయకత్వం ఆర్థిక నేరగాళ్ల పట్ల పాలిట వరంగా మారిందని,ఈజీ మనీ/ఫాస్ట్/ క్విక్/ ఇన్ స్టంట్ మనీ సులువుగా/ ఆయాచితంగా వచ్చే డబ్బు కు ఆశపడి మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్ మోసాల భారిన పడి భారీగా నష్టపోతున్నారు అని అన్నారు.మోసపూరిత మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్ లలో మొహమాటానికి పోయి తెలిసిన వారిని చేర్పించడం ద్వారా సన్నిహితులతో సత్సంబంధాలు దెబ్బతింటయని, ఎంఎల్ఎం స్కీమ్ లలో మోసపోయే వారికి అసలు ఈ స్కీమ్ వెనుక సూత్రధారి ఎవరనే విషయం ఎప్పటికీ తెలియదని అన్నారు.ఈ గొలుసుకట్టు స్కీమ్ లు ఎప్పుడు, ఎక్కడ తెగుతాయో ఎవరికీ తెలియదని,అనుకున్నంత మొత్తంలో డబ్బు రాగానే ఎంఎల్ఎం స్కీమ్ ను నడిపిస్తున్న వారు బోర్డు తిప్పేస్తారని, అందులో చేరిన వారంతా బాధితులుగా మిగిలిపోతారని అన్నారు.ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు ఇస్తామనే ప్రకటనలను నమ్మి మీ కష్టార్జితన్ని కోల్పోవద్దని,సైబర్ నేరాలకు గురైతే వెంటనే సైబర్ ట్రోల్ ఫ్రీ నంబర్ 1930 కి పిర్యాదు చేయాలనీ తెలిపారు.

## ఐసీసీ తాజా టెస్టు ర్యాంకింగ్స్ విడుదల



**బలగం టీవీ ,హైదరాబాద్**



పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ అజామ్ ఐసీసీ తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో టాప్ - 10లో చోటు కోల్పోయాడు. ఐసీసీ బుధవారం రిలీజ్ చేసిన ర్యాంకింగ్స్‌లో బాబర్ ఏకంగా మూడు స్థానాలు దిగజారి 12వ స్థానం (712 రేటింగ్స్?)లో నిలిచాడు. కాగా, గత ఐదేళ్లలో బాబర్ టాప్- 10లో చోటు కోల్పోయవడం ఇదే తొలిసారి. ప్రస్తుతం పాక్ నుంచి మహ్మద్ రిజ్వాన్ ఒక్కడే (720 రేటింగ్స్?) టాప్ -10లో కొనసాగుతున్నాడు. ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ 922 రేటింగ్స్‌తో అగ్రస్థానం నిలబెట్టుకున్నాడు.

కాగా, టీమ్ఇండియా నుంచి కెప్టెన్ రోహిత్ శర్మ (751 రేటింగ్స్), యశస్వీ జైస్వాల్ (740 రేటింగ్స్), విరాట్ కోహ్లీ (737 రేటింగ్స్) వరుసగా ఆరు, ఏడు, ఎనిమిది స్థానాల్లో కొనసాగుతున్నారు. న్యూజిలాండ్ బ్యాటర్లు కేన్ విలియమ్సన్ (859) రెండో స్థానంలో, డారిల్ మిచెల్ (768) మూడో స్థానంలో నిలిచారు. ఆస్ట్రేలియా క్రికెటర్ స్టీవ్ స్మిత్ (757) ఒక స్థానం మెరుగై నాలుగో స్థానం దక్కించుకున్నాడు. ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (753) ఐదో స్థానానికి పడిపోయాడు.

## చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి...



- **ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
- **ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ , కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ ,చందుర్తి:**

చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని అధికారులను ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ ఆదేశించారు.బుధవారం చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. పాఠశాల ఆవరణలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి వసతులను పరిశీలించారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ సూచించారు. అది శ్రీనివాస్ ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను గ్రామస్థులు విప్, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ హామీ ఇచ్చారు.



## నేటి నుంచి దులీప్ ట్రోఫీ

**బలగం టీవీ , పారీస్**

దులీప్ ట్రోఫీ టోర్నీ గురువారం నుంచి ప్రారంభం కానుంది. నాలుగు జట్ల టోర్నీలో టీమిండియా ఆటగాళ్లు కూడా పాల్గొనడం విశేషం. టోర్నీలో ఆటగాళ్లను ఏ,బీ,సీ,డీ జట్లుగా విభజించారు. ఏ జట్టుకు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహిస్తుండగా, బీ జట్టుకు అభిమన్యు మిథున్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. సీ జట్టుకు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా ఉండగా, డీజట్టుకు రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వం వహించనున్నాడు. ఈసారి దులీప్ ట్రోఫీ రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో జరగనుంది.అంటే, ఒక్కో జట్టు మూడు మ్యాచ్‌లు ఆడుతుంది.ఆ తర్వాత పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టును ఛాంపియన్‌గా ప్రకటిస్తారు. ఈ టోర్నీలో సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు ఉండవు.కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతరపురం, బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి.

స్పోర్ట్స్ 18 నెట్‌వర్క్ ఛానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఇక ఓటీటీలో చూడాలంటే 'జియో సినిమా' వేదికగా చూడాలి. జియో సినిమాలో లైవ్ చూడటానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. మ్యాచ్‌లన్నీ ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నాయి.

**షెడ్యూల్ వివరాలు**

సెప్టెంబర్ 5 నుండి 8 వరకు - టీమ్ ఏ VS టీమ్ బీ - బెంగళూరు
సెప్టెంబర్ 5 నుండి 8 వరకు -టీమ్ సీ VS టీమ్ డీ - అనంతపురం
సెప్టెంబర్ 12 నుండి 15 వరకు - టీమ్ ఏ VS టీమ్ డీ - అనంతపురం
సెప్టెంబర్ 12 నుండి 15 వరకు - టీమ్ బీ VS టీమ్ సీ - అనంతపురం
సెప్టెంబర్ 19 నుండి 22 వరకు - టీమ్ బీ VS టీమ్ డీ - అనంతపురం
సెప్టెంబర్ 19 నుండి 22 వరకు - టీమ్ ఏ VS టీమ్ సీ- అనంతపురం



## పారాలింపిక్స్‌లో తెలంగాణ అమ్మాయికి కాంస్యం






**బలగం టీవీ , పారీస్**

పారాలింపిక్స్‌లో తెలంగాణ అమ్మాయి దీప్తి జివాంజీ కంచు మోత మోగించింది. మహిళల 400 మీటర్ల పరుగు పందెం(టీ20)లో దీప్తి.. 55.82 సెకన్లలో పరుగును పూర్తిచేసి మూడో స్థానాన్ని దక్కించుకుని కాంస్యంతో సత్తా చాటింది. అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం నెగ్గిన ఉక్రెయిన్ అథ్లెట్ షలియర్ యులియ (55.16), రజతం గెలిచిన టర్కీ అమ్మాయి ఒండర్ ఐసెల్ (55.23)కు దీప్తి మధ్య తేడా మిల్లీ సెకన్లే.

సోమవారం జరిగిన హీట్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన దీప్తి.. తుది పోరులో తృటిలో బంగారు పతకాన్ని చేజార్చుకున్నా పోడియంపై మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించింది. రేసు మధ్య వరకూ రెండో స్థానంలో ఉన్న దీప్తి లక్ష్యానికి కొద్దిదూరంలో ఉండగా నెమ్మదించడాన్ని టర్కీ అమ్మాయి సద్వినియోగం చేసుకుంది. ఇక బ్యాడ్మింటన్‌లో మరో షట్లర్ సుమతి శివన్ నిత్య శ్రీ (ఎస్‌హెచ్6) కాంస్య పోరులో గెలిచి భారత్‌కు మరో పతకాన్ని అందించింది.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు**



పారిస్ వేదికగా జరుగుతోన్న పారాలింపిక్స్-2024లో మన దేశానికి మరో పతకం సాధించిన తెలంగాణ బిడ్డ జీవాంజి దీప్తికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. పారాలింపిక్స్ మహిళల 400 మీటర్ల టీ20 రేసులో దీప్తి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ప్రతిభకు వైకల్యం అడ్డురాదని నిరూపిస్తూ విశ్వ క్రీడా వేదికపై విజేతగా నిలిచిన దీప్తి మనందరికీ గొప్ప స్ఫూర్తి అని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు. పారాలింపిక్స్ 2024లో మెడల్స్ సాధించిన భారత అథ్లెట్స్, ప్లేయర్స్ అందరికీ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.



ఇక దీప్తి జీవాంజికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు అభినందనలు తెలిపారు.అసమాన ప్రతిభతో రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచావని.. ఆడపిల్లలు తమ అసమానమైన శక్తి సామర్థ్యాలతో ఎంతటి ఆనందాన్ని తల్లితండ్రులకు ఇస్తారో ఆడ పిల్ల తండ్రిగా తనకు తెలుసునని.. ఎన్ని కష్టాలున్న సరే దీప్తి తల్లిదండ్రులు మాత్రం తన మీద నమ్మకం ఉంచటం గొప్ప విషయమన్నారు. ఆ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ దీప్తి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలవటం సంతోషంగా ఉందన్నారు.

## అన్నదాన సత్రం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చెయ్యండి..



- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ ,వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం సన్నిధిలో అన్నదానం సత్రం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు.బుధవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలోని శివార్చన మండపం వద్ద సత్రం నిర్మాణానికి స్థలాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఆలయ ఈఓ వినోద్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల స్వామి వారి దర్శనం సందర్భంగా చేసిన ప్రకటనలో భాగంగా ఈ రోజు స్థల పరిశీలన చేశామని అన్నారు.రాజన్న భక్తులకు సులభంగా వేగంగా దర్శనం, వసతి ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని,బ్రేక్ దర్శనం అమలు చేస్తునామని తెలిపారు. అలాగే భక్తులకు నిత్యం అన్న దానం అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు . రోజు 15,000 మంది భోజనం చేసేలా భవనాన్ని నిర్మించెలా ప్రతిపాదనలు రూపొందించాలని, ఈ శనివారం లోగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఈఈ రాజేష్, డీఈ రఘునందన్,ఆలయ ఈవో వినోద్ రెడ్డి,ఈ ఈ రాజేష్, డి ఈ రఘునందన్,ప్రోటోకాల్ పర్యవేక్షకులు అశోక్, ఎడ్ల శివ సాయి తదితరులు పాల్గొన్నారు.

## 20కు చేరుకున్న భారత్ పతకాల సంఖ్య

**బలగం టీవీ , పారీస్**



పారాలింపిక్స్‌లో భారత్ పతకాల సంఖ్య 20కు చేరింది. మంగళవారం భారత పారా అథ్లెట్‌లు అద్భుత ప్రదర్శనతో రెండు రజత పతకాల సహా మొత్తం ఐదు పతకాలు దేశానికి అందించారు. జావెలిన్ త్రోలో భారత్‌కు మరో రెండు పతకాలు వచ్చాయి.ఎఫ్ 46 విభాగం ఫైనల్లో పారా అథ్లెట్ అజీత్ సింగ్ ఈటెను 65.62 మీటర్ల విసిరి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించాడు. ఇదే విభాగంలో పోటీ పడిన మరో పారా అథ్లెట్ సుందర్ సింగ్ గుర్జార్ 64.96 మీటర్లు విసిరి మూడోస్థానంలో నిలిచి కాంస్యాన్ని అందుకున్నాడు. అటు హైజంప్‌లో కూడా భారత్‌కు రెండు పతకాలు వచ్చాయి.ఇక ఎఫ్ 63 విభాగంలో శరద్ కుమార్ 1.88 మీటర్లు గెంతి రెండోస్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. ఇదే విభాగంలో బరిలోకి దిగిన మరియప్పన్ తంగవేలు 1.85 మీటర్లు గెంతి కాంస్య పతకాన్ని సాధించాడు. అటు మహిళల 400 మీటర్ల పరుగు టీ-20 విభాగంలో దీప్తి జీవాంజి దేశానికి కాంస్య పతకాన్ని అందించింది. ఫైనల్లో 55.82 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఇప్పటివరకు పారాలింపిక్స్‌లో భారత్‌కు మూడు స్వర్ణాలు, 7 రజతాలు, 10 కాంస్య పతకాలు వచ్చాయి.



# దేవర నుంచి 'దావూదీ' పాట విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

జూనియర్ ఎన్టీఆర్– జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న 'దేవర పార్ట్ –1' నుంచి మూడో పాట రిలీజైంది. 'దావూదీ' అనే పాటను మూవీ మేకర్స్ బుధవారం విడుదల చేశారు. ప్రముఖ లిరిసిస్ట్ రామజోగయ్య శాస్త్రి ఈ పాట రాశారు. మ్యూజిక్ సంచలనం అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిచగా, సింగర్స్ నకాశ్ నజీజ్, ఆకసా పాట ఆలపించారు. ఈ పాటలో ఎన్టీఆర్– జాన్వీ కపూర్ డ్యాన్స్ అదరగొట్టేశారు. ఫుల్ ఎనర్జీతో స్టెప్పులు ఇరగదీశారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ దేవర రెండు పార్టులుగా తెరకెక్కుతుంది. దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటిస్తుండగా.. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీ రోల్స్ పోషిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.


# ఏఎన్ఆర్ 10 క్లాసికల్ సినిమాలు రీ రిలీజ్

**తెలుగు చిత్ర పరిశ్రమలో చెరగని ముద్ర వేసి దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావు. ఆయన 100వ జయంతిని పురస్కరించుకుని దేశంలోని 25 నగరాల్లో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. సెప్టెంబరు 20 నుంచి రెండు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో ఏఎన్ఆర్ నటించిన పది క్లాసిక్ మూవీస్ ను థియేటర్లలో ప్రదర్శించనున్నారు.'ఏఎన్ఆర్ 100- కింగ్ ఆఫ్ ది సిల్వర్ స్క్రీన్' పేరిట ఈ రెట్రోస్పెక్టివ్ ఫెస్టివల్‌ను లాభాపేక్ష లేని సంస్థ ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ (ఎఫ్‌హెచ్‌ఎఫ్) నిర్వహించనుంది. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదలైంది.**

**బలగం టీవి, హైదరాబాద్**

దివంగత లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వర్ రావు శత జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు టాలీవుడ్ రెడీ అవుతోంది. సెప్టెంబర్ 20న 100వ జయంతిని పురస్కరించుకొని ఏఎన్ఆర్ క్లాసికల్ చిత్రాలను గుర్తు చేసుకుంటూ.. ఆయన కెరీర్‌లో మరుపురానివిగా నిలిచిపోయిన ఐకానిక్ సినిమాలను రీరిలీజ్ చేయనున్నారు.

శత జయంతి సందర్భంగా ఏఎన్ఆర్ నటించిన 10 ఐకానికి చిత్రాలను దేశవ్యాప్తంగా 25 పట్టణాల్లో విడుదల చేయనున్నారు. సెప్టెంబర్ 20–22 వరకు ఎంపిక చేయబడ్డ పీవీఆర్–ఐనాక్స్ థియేటర్లలో రీరిలీజ్ కానున్నాయి. ఫిల్మ్ హెరిటేజ్ ఇండియా, నేషనల్ ఫిల్మ్ ఆర్చీవ్ ఇండియా ఈ చిత్రాలను విడుదల చేయనున్నాయి.




**రీరిలీజ్ కాబోయే చిత్రాలివే..**

దేవదాసు (1953), మైసమ్మ (1955), మాయా బజార్ (1957), భార్య భర్తలు (1961), గుండమ్మ కథ (1962), సుడిగుండాలు (1968), ప్రేమ్ నగర్ (1971), ప్రేమాభిషేకం (1981), మనం (2014)

# వరద బాధితులకు చిరంజీవి, ప్రభాస్, అల్లు అర్జున్ భారీ విరాళం





**బలగం టీవి, హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల్లో వరద ప్రభావం వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు టాలీవుడ్ సినీ ప్రముఖులు ఒక్కొక్కరుగా ముందుకొస్తున్నారు. ఇప్పటికే బాలకృష్ణ, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, విశ్వక్‌సేన్, సిద్ధూ జొన్నలగడ్డ తదితరులు విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా నటులు చిరంజీవి, ప్రభాస్, అల్లు అర్జున్ కూడా వరద బాధితుల కోసం తమ వంతు సాయం ప్రకటించారు

మెగాస్టార్ ఏపీ, తెలంణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 లక్షల చొప్పున విరాళం ప్రకటించారు. ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా తెలియజేశారు.తెలుగు రాష్ట్రాల్లో వరద ప్రభావం వల్ల ప్రజలకు కలిగిన, కలుగుతున్న కష్టాలు తనను కలిచివేస్తున్నాయని మెగాస్టార్ చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో అమాయక ప్రాణాలు కోల్పోవడం ఎంతో విషాదకరమని అన్నారు.తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నిర్దేశంలో రెండు ప్రభుత్వాలు శాయశక్తులా పరిస్థితిని మెరుగు పరచడానికి కృషి చేస్తున్నాయని తెలిపారు. మనందరం ఏదో విధంగా సహాయక చర్యల్లో పాలుపంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రెండు రాష్ట్రాలలో ప్రజల ఉపశమనానికి తోడ్పాటుగా నా వంతు కోటి రూపాయలు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్ కు చెరో 50 లక్షలు) విరాళంగా ప్రకటిస్తున్నానని వెల్లడించారు. ఈ విపత్కర పరిస్థితులు తొందరగా తొలగిపోవాలని, ప్రజలంతా సురక్షితంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని అన్నారు.

ఇక వరద బాధితుల కోసం ఏపీ, తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌లకు ప్రభాస్ రూ. కోటి చొప్పున మొత్తం రెండు కోట్లు విరాళం ప్రకటించగా.. అల్లు అర్జున్ రూ.50 లక్షల చొప్పున ఇరు రాష్ట్రాలకు మొత్తం ఒక కోటి విరాళం ప్రకటించారు. ఈ విషయాన్ని ఇద్దరు హీరోలు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో వరద ప్రభావం వల్ల ప్రజలకు కలిగిన, కలుగుతున్న కష్టాలు తనను కలిచివేస్తున్నాయని.. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితిలో సహాయ చర్యలకు మద్దతుగా తాను రెండు రాష్ట్రాల సిఎం రిలీఫ్ ఫండ్‌లకు మొత్తం రూ.కోటి విరాళంగా ఇస్తున్నాను. ప్రజలంతా సురక్షితంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని అల్లు అర్జున్ రాసుకోచ్చాడు.

# టాలీవుడ్ అమీర్ ఖాన్.. ప్రియదర్శి : నాని



**బలగం టీవి, హైదరాబాద్**

పియదర్శి టాలీవుడ్ అమీర్ ఖాన్ అని హీరో నాని అన్నారు. నివేదా థామస్, విశ్వదేవ్ లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న సినిమా 35 చిన్న కథ కాదు. నందకిశోర్ (డెబ్యూ డైరెక్టర్) దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రియదర్శి కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీని సెప్టెంబర్ 6న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాని పాల్గొని మాట్లాడాడు. ప్రియదర్శి టాలీవుడ్ అమీర్ ఖాన్ అని.. 35 చిన్న కథ కాదు టాలీవుడ్ తారే జమీన్ అన్నాడు. ఇక ప్రియదర్శి, సినిమాపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేయడంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. లిమిటెడ్ స్క్రీనింగ్స్‌లో పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది.

ఈ చిత్రాన్ని సురేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రానా దగ్గుబాటి సమర్పిస్తుండగా.. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. నివేదా థామస్ సరస్వతి అనే సాధారణ గృహిణి పాత్రలో నటిస్తుంది. తన భర్త, ఇల్లు, పిల్లల చదువు చుట్టూ సినిమా సాగనుందని ట్రైలర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. తిరుపతి బ్యాక్‌డ్రాప్‌లో చిన్న కుటుంబం చుట్టూ తిరిగే కథాంశంతో సినిమా ఉండబోతుంది.

## నేడు విజయ్ 'ది గోట్' విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

దళపతి విజయ్, క్రియేటివ్ డైరెక్టర్ వెంకట్ ప్రభు ల మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది గో ట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై లిమిటెడ్‌పై కల్పాతి ఎస్ అఘోర మ్, కల్పాతి ఎస్ గణేష్, కల్పాతి ఎస్ సురేష్ నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ పాన్ ఇండియా మూవీ తె లుగు వర్షన్‌ను గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. 'ది గోట్' ఈనెల 5న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కా నుంది. ఈ సందర్భంగా గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈ వెంట్ నిర్వహించారు. డైరెక్టర్ వెంకట్ ప్రభు మాట్లాడుతూ "ది గోట్ మూవీ హెూల్సమ్ ఎంటర్‌టైనర్. థియేటర్స్‌లో అందరూ చాలా ఎంజాయ్ చేస్తారు. దళపతి విజయ్‌ని చా లా కొత్తగా చూపించాము"అని అన్నారు.